# సంగమేశ్వర ప్రాజెక్టుతో... లక్ష ఎకరాలకు సాగునీరు

## కేతకీ సంగమేశ్వరుడు కొలువైన నేల జహీరాబాద్

- కాళేశ్వరంతో సింగూరు ప్రాజెక్టును లింక్ చేసుకుందాం
- ఏడాది పొడవునా రెండు పంటలు పండించుకుందాం
- తాను మంత్రిగా ఉన్న సమయంలో జహీరాబాద్ ప్రాంతంలో తిరిగా..
- ఏడాకుల చెరువును బాగు చేయించా.. వెయ్యి ఎకరాలకు సాగు నీరు అందుతున్నది
- నారింజ ప్రాజెక్టును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసుకుందాం
- మీ జిల్లా మంత్రి హరీశ్‌రావుతో కలిసి చేసే బాధ్యత నాది..
- వికారాబాద్‌లో చెల్లని రూపాయి... జహీరాబాద్‌లో చెల్లుతుందా..?
- మన దగ్గర లీడర్లు లేరని వికారాబాద్ నుంచి తెచ్చుకున్నారా..?
- స్థానిక మనిషినికాదని పరాయి వ్యక్తిని గెలిపిస్తే ఏమైనా ఇజ్జత్ ఉంటుందా..?
- జహీరాబాద్ తలరాతను మార్చే ఎన్నికలు
- స్థానికుడైన మాణిక్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలి
- జహీరాబాద్ ప్రజా ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు

సిద్దిపేట, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఝరాసంఘం కేతకీ సంగమేశ్వరుడు కొలువైన ఈ భూమికి శిరస్సు వచ్చి నమస్కరిస్తున్నాను. జహీరాబాద్ నియోజకవర్గానికి సంగమేశ్వర, నారాయణఖేడ్‌కు బసవేశ్వర ప్రాజెక్టులు వస్తున్నాయి. కాళేశ్వర ప్రాజెక్టుతో సింగూరుకు లింక్ చేసుకుంటున్నాం, కాల్వల పనులు పూర్తి అవుతున్నాయి. సంగమేశ్వరతో లక్ష ఎకరాలకు సాగునీరు వస్తుంది అని బీఆర్‌ఎస్ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రా వు అన్నారు. గురువారం సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్ నియోజకవర్గ కేంద్రంలో స్థానిక బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మాణిక్‌రావుకు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు, ఎంపీ బీబీపాటిల్‌తో కలిసి సీఎం కేసీఆర్ పాల్గొన్నారు. నియోజకవర్గం నలు మూలల నుంచి ఆశేషంగా తరలివచ్చిన ప్రజలతో సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. మంత్రిగా ఉన్న సమయంలో జహీరాబాద్ ప్రాంతంలో తిరిగానని, ఏడాకుల చెరువును కట్టించానని చెప్పారు. ఏడాకులపల్లి చెరువును పెద్దగా చేస్తే ఇయ్యాళ వెయ్యి ఎకరాలకు సాగునీరు అందుతున్నదని చెప్పారు. హరీశ్‌రావు నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రంలో మిషన్ కాకతీయ కింద వందలాది చెరువులు పునరుద్ధరించుకున్నామన్నారు. ప్రాజెక్టులు, లిఫ్టులతో నీళ్లు పారుతున్నాయో ప్రతి రాష్ట్రంలో నీటితిరువాను వసూలు చేస్తారన్నారు. మన పక్కనే ఉన్న కర్ణాటక, మహారాష్ట్రలో సైతం వసూలు చేస్తారని తెలిపారు. మన రాష్ట్రంలో నీటి పన్నును రద్దు చేశామన్నారు. రైతులకు నాణ్యమైన ఉచిత కరెంట్ ఇస్తున్నామన్నారు. ప్రతి గుంటకు రైతుబంధు ఇస్తున్నామన్నారు. రైతుబంధును సృష్టించింది కేసీఆర్, బీఆర్‌ఎస్ ప్రభుత్వం అని చెప్పారు. ఎవరైన రైతు ఆకాలమరణం చెందితే రైతుబీమా కింద రూ.5 లక్షలు వారంలోపల ఆ ఇంటికి అందిస్తున్నామన్నారు. రైతుల ముంగిటనే కాంటలు పెట్టి రైతు పండించిన ధాన్యాన్ని కొట్టున్నామని చెప్పారు.

### ఇక మనకు ఏడాది పొడవునా సాగునీరే..

నారింజ ప్రాజెక్టును పట్టించుకునే వారేలేరు.. ఇప్పుడు మాణిక్‌రావు అడిగారు. దానిని కొంత మేర చేసుకున్నాం..పూర్తి చేయిస్తామని సీఎం కేసీఆర్ చెప్పారు. దీనిని మంచి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసుకుందామన్నారు. సంగమేశ్వర లిఫ్టు పనులు కూడా జరుగుతున్నాయన్నారు. సింగూరుకు కాళేశ్వరం లింకు చేసుకుంటే మనకు 365 రోజులు సింగూరు నిండా నీళ్లు ఉంటాయన్నారు. దీంతో రెండు పంటలు పండించుకోవచ్చన్నారు. లక్ష ఎకరాలకు సాగునీరు వస్తుందన్నారు.

### వికారాబాద్‌లో చెల్లని రూపాయి... జహీరాబాద్‌లో చెల్లుతుందా..?

జహీరాబాద్ నుంచి కాంగ్రెస్ తరపున పోటీ చేస్తున్న వ్యక్తిది వికారాబాద్. మన దగ్గర లీడర్లు లేరని వికారాబాద్ నుంచి తీసుకొచ్చారా.? వికారాబాద్‌లో చెల్లని రూపాయి జహీరాబాద్‌లో చెల్లుతుందా అని సీఎం కేసీఆర్ ప్రశ్నించారు. వాళ్లకే ఇకారం అని చెప్పి వాళ్లు ఎలగొటింద్రు... రెండు మాట్ల ఓడ గొట్టింద్రు మళ్ల జహీరాబాద్‌లో చెల్లుతుందా..? మన లోకల్ లీడర్ మాణిక్‌రావు కావాలనా..? వికారాబాద్ ఆయన కావాలనా..? ఇది జహీరాబాద్ ప్రజల ఆత్మగౌరవ పరీక్ష అని అన్నారు. లోకల్ మనిషిని విడిచిపెట్టి పరాయి వ్యక్తిని గెలిపిస్తే ఏమైనా ఇజ్జత్ ఉంటుందా..? అందుకోసం దయచేసి మాణిక్‌రావు సౌమ్యుడు, ఉత్తముడు, జహీరాబాద్ ప్రజల మధ్యన ఉండే వ్యక్తిని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇక్కడ ఉన్న సమస్యల పరిష్కార బాధ్యత తీసుకుంటానని ప్రజలకు సీఎం హామీ ఇచ్చారు.

### జిల్లా మంత్రి హరీశ్ ఉన్నాడు..

జిల్లా మంత్రి హరీశ్‌రావు ఉన్నారు. మీరు అందరూ సహకరించి ఎమ్మెల్యేగా మాణిక్‌రావును గెలిపించాలని సీఎం కేసీఆర్ కోరారు. అన్ని పనులు చేసే బాధ్యతను తాను, మంత్రి హరీశ్‌రావు తీసుకుంటామని హామీనిచ్చారు. ఇప్పుడు హరీశ్‌రావు ఆరోగ్యమంత్రిగా ఉన్నారు. ఇవ్వాళ ప్రతి పల్లెలో పల్లె దవాఖానలు ఏర్పాటు చేసుకొని ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నామన్నారు. పట్టణంలో బస్తీ దవాఖానలు ఏర్పాటు చేసామన్నారు. నియోజకవర్గంలో వంద పడకల దవాఖానలు అందుబాటులోకి వచ్చాయని సీఎం కేసీఆర్ అన్నారు.

### జహీరాబాద్ తలరాతను మార్చే ఎన్నికలివి..

మీ ఓటు వజ్రాయుధం అని వచ్చే ఐదేండ్లు మీ తలరాతను, మీ జహీరాబాద్, రాష్ట్ర తలరాతను మారుస్తుందని సీఎం కేసీఆర్ చెప్పారు. ఓటు అంటే ఆషామాషి కాదన్నారు. బాగా ఆలోచన చేసి జాగ్రత్తగా ఓటు వేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్నికలు రాగానే ఆగంఆగం కావద్దు అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా మాణిక్‌రావును గుణగణాలు చూడాలి..మీ అభ్యర్థి వెనకాల ఉన్న పార్టీ పనితీరును చూడాలన్నారు. ఈ తొమ్మిదేండ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏం చేసిందో మీ కండ్ల ముందు ఉంది. చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు మీ ముందట ఉన్నాయన్నారు. వీటన్నింటినీ ఆలోచన చేసి ఓటు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ పుట్టిందే తెలంగాణ ప్రజల కోసం అన్నారు. కాంగ్రెస్ పార్టీ 50 ఏండ్లు పాలించిందన్నారు. వారి పాలనలో ఎలా ఉంది .? తొమ్మిదేండ్ల బీఆర్‌ఎస్ పాలన ఎలా ఉందో ప్రజలు ఆలోచన చేయాలన్నారు. కాంగ్రెస్ పాలనలో అనేక కష్టాలు పడ్డామన్నారు. ఏనాడూ ప్రజల కోసం ఆలోచన చేయాని పార్టీ కాంగ్రెస్ అని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో తాగునీరు లేదు, సాగునీరు లేదు, కరెంట్ కష్టాలతోపాటు చాలా ఇబ్బందులు ఉండేవన్నారు. రైతుల ఆత్మహత్యలు ఉండేవన్నారు. ఇవ్వాళ బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాక తాగునీటి కష్టాలు తీర్చుకున్నామన్నారు. సాగునీరు తెచ్చుకున్నాం. రైతులకు నాణ్యమైన కరెంట్‌ను ఇస్తున్నామన్నారు. రైతుల సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం పని చేసిందని సీఎం చెప్పారు.

### ఫరీదుద్దీన్ మంచి మిత్రుడు: సీఎం కేసీఆర్

మాజీమంత్రి ఫరీదుద్దీన్ తనకు మంచిమిత్రుడు.. ఎప్పుడూ ఫరీదుద్దీన్ జహీరాబాద్ అభివృద్ధి కోసం మాట్లాడే వారని, ఫరీదుద్దీన్ తనయుడు తన్వీర్‌కు రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమించానని సీఎం చెప్పారు. భవిష్యత్‌లో ఉన్నత పదవులు ఇస్తానని, ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించాలని కోరారు. ముస్లింల సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలు ఏర్పాటు చేసిందన్నారు. మైనార్టీ విద్యార్థుల కోసం గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి నాణ్యమైన బోధన చేస్తున్నామని చెప్పారు. నేను మంత్రిగా ఉన్నప్పుడు జహీరాబాద్ ఎమ్మెల్యే చెంగల్ బాగన్నతో కలిసి నియోజకవర్గంలో పర్యటించానన్నారు. ఝరాసంగం మండలంలోని ఏడాకులపల్లి చెరువు నిర్మించి వేల ఎకరాలకు సాగునీరు అందించామన్నారు.

జహీరాబాద్ ప్రజా ఆశీర్వాద సభకు భారీగా హాజరైన జనం






జహీరాబాద్ ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, పక్కన అభ్యర్థి కొనింటి మాణిక్‌రావు, మంత్రి తన్నీరు హరీశ్‌రావు

# సీఎం కేసీఆర్ సభ సక్సెస్

## వేలాదిమంది జనంతో కిక్కిరిసిన జహీరాబాద్ సభాప్రాంగణం

- బీఆర్‌ఎస్ శ్రేణుల్లో నూతనోత్సాహం
- సభ సక్సెస్‌తో ఖాయమైన బీఆర్‌ఎస్ అభ్యర్థి మాణిక్‌రావు గెలుపు
- సభా ప్రాంగణాన్ని హెలికాప్టర్‌తో చుట్టేసిన సీఎం కేసీఆర్
- కరతాల ధ్వనుల మధ్య సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలికిన బీఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజలు

జహీరాబాద్, నవంబర్ 23: జహీరాబాద్‌లో సీఎం కేసీఆర్ నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభ సక్సెస్ కావడంతో గులాబీ శ్రేణుల్లో జోష్ వచ్చింది. సీఎం కేసీఆర్ సభకు భారీగా ప్రజలు తరలిరావడంతో నాయకులకు, కార్యకర్తలో ఉత్సాహం కనిపించింది. నియోజకవర్గంలోని జహీరాబాద్ మండలం, పట్టణంతో పాటు మొగుడంపల్లి, న్యాల్‌కల్, ఝరాసంగం, కోహీర్ మండలం నుంచి భారీ సంఖ్యలో మహిళలు తరలివచ్చిరు. ఎమ్మెల్యే మాణిక్‌రావు, బీఆర్‌ఎస్ అభ్యర్థి కొనింటి మాణిక్‌రావును భారీ మోజార్టీతో గెలిపించండి.. మీ సమస్యలు నేనూ, మంత్రి హరీశ్‌రావు పరిష్కారం చేస్తామన్నారు. నియోజకవర్గంలో ఉన్న లక్ష ఎకరాలకు కాళేశ్వరం నీటిని అందిస్తామని ప్రకటించడంతో ప్రజలు సంతోషంగా వ్యక్తం చేశారు. ప్రతి ఇంటికి అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. గిరిజన మహిళలు, రైతులు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభకు ప్రజలు భారీగా రావడంతో మాణిక్‌రావు గెలుపు ఖాయమని తెలిసిపోయింది. వికారాబాద్‌లో చెల్లని రూపాయి.. జహీరాబాద్‌లో చెల్లుతుందా అని ప్రజలను ప్రశ్నించారు. కాంగ్రెస్ అభ్యర్థి ఎలాంటి వ్యక్తిలో ఆలోచన చేసిన ఓట్లు వేయాలని కోరారు. సీఎం సభ ఏర్పాట్లును ఎమ్మెల్యే మాణిక్‌రావు, రాష్ట్ర బేవరేజేస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చైర్జి దేవీప్రసాద్‌రావు, ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ పర్యవేక్షణ చేశారు. టెలికం బోర్డు సభ్యులు, నియోజకవర్గ గిరిజన తండాల ఇన్‌చార్జి పవార్ శంకర్‌నాయక్ సీఎం కేసీఆర్‌కు సేవాలాల్ చిత్రపటం అందజేసి సన్మానం చేశారు. ఈ ప్రజా ఆశీర్వద సభలో జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్యే మాణిక్‌రావు, మాజీ శాసనసభాపతి మధుసుదనాచారి, రాష్ట్ర బేవరేజేస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి దేవీప్రసాద్‌రావు, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నరోత్తం, టీఎస్ఐడీ చైర్మన్ తన్వీర్, ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మాల్కాపురం శివకుమార్, సీడీసీ చైర్మన్ ఉమాకాంత్‌పాటిల్, రైల్వే బోర్డు సభ్యులు షేక్ ఫరీదు, ఆత్మకమిటీ చైర్మన్ పెంటారెడ్డి, టెలికం బోర్డు సభ్యుడు పవార్ శంకర్‌నాయక్, జడ్పీటీసీలు స్వప్నాభాస్కర్, వినీలానరేశ్, న్యాల్‌కల్ ఎంపీపీ అంజమ్మ, బీఆర్‌ఎస్ నాయకులు విజయ్‌మోహన్‌రెడ్డి, గుండప్ప, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సయ్యద్ మోహినొద్దీన్, తట్టు నారాయణ, నర్సింహులు, వెంకటేశం, రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి, మహిళా నాయకులు సరస్వతిరెడ్డి, అనుషామ్మ, మంజూల, శీలారమేశ్ పాల్గొన్నారు.

### నారింజ ప్రాజెక్టును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలి: బీఆర్‌ఎస్ అభ్యర్థి కొనింటి మాణిక్‌రావు

జహీరాబాద్ మండలంలోని కొత్తూర్(బి) గ్రామంలో ఉన్న నారింజ ప్రాజెక్టును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే మాణిక్‌రావు కోరారు. ప్రాజెక్టును పర్యటక ప్రాంతంగా అభివృద్ధి చేసి వ్యవసాయనికి సాగునీరు అందించాలన్నారు. జహీరాబాద్‌లో మహిళా డిగ్రీ గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేయాలని కోరారు. మూడుసార్లు జహీరాబాద్ ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడంపై ఎప్పుడూ సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటానన్నారు. 2014 నుంచి నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. తెలంగాణ సరిహద్దులో ఉన్న కర్ణాటక గ్రామాల ప్రజలు తెలంగాణలో కలుపుకోవాలని కోరుతున్నారని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి ఉన్నదన్నారు.

### బీఆర్‌ఎస్ హయాంలో జహీరాబాద్ అభివృద్ధి: ఎంపీ, బీబీపాటిల్

జహీరాబాద్ ప్రాంతం బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఎంతో అభివృద్ధి సాధించిందని ఎంపీ బీబీపాటిల్ అన్నారు. ఈ పదేండ్లలో నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులతో పాటు సమస్యలను పరిష్కరించామని చెప్పారు. అన్నివర్గాల సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ పార్టీ మంచి మ్యానిఫెస్టోను విడుదల చేసిందన్నారు. ఈనెల 30న జరగనున్న పోలింగ్‌లో కారుగుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి మాణిక్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మాణిక్‌రావు గెలుపుతో నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందన్నారు.